క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓకార్యాలయం, పీహెచ్‌సీ, కర్ణాటక బ్యాంకులో సైబర్ నేరాల పట్ల అవగాహన అనే కాల్యెండర్‌ను శనివారం విడుదల చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫొటోలను మార్ఫింగ్ చేసి, వీడియో కాల్ చేసి, డబ్బులు డిమాండ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్, డాక్టర్ శ్రీలక్ష్మి, ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి, డీటీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దేవర ప్రశాంతంగా జరుపుకోండి

కూడేరు: ముద్దలాపురాన్ని శనివారం రాత్రి సీఐ రాజు సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈనెల 21,22న జరిగే ఊరు దేవరపై చర్చించారు. అందరూ స్నేహ భావంతో కలిసిమెలిసి దేవరను జరుపుకోవాలన్నారు. దేవర సందర్భంగా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అవగాహనతోనే కుష్టు నివారణ



కూడేరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కూడేరు: మైకో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా కుష్టు వ్యాధి వస్తుందని లెప్రసీ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ టీహెచ్ తిప్పేస్వామి తెలిపారు. శనివారం కూడేరులో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ తిప్పేస్వామి, వైద్యాధికారులు 'కుష్టు వ్యాధి నివారణ'పై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా కుష్టు వ్యాధి సర్వే ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సురేంద్ర రెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

బొమ్మనహాళ్: కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నిర్మూలనకు కృషి చేద్దామని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి పిలుపునిచ్చారు. శనివారం శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఏఎన్‌ఎమ్స్, ఆశా వర్కర్స్, హెల్త్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఎంపీహెచ్‌ఈఓ శివ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీఎస్ బాలాజీ, గౌతమి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



కబ్జాకు గురైన స్థలంలో కాంప్లెక్స్ రూమ్‌లు నిర్మిస్తున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కణేకల్లులోని రామనగర్ వద్ద రాయదుర్గం ప్రధాన రహదారి పక్కన ఓ పత్రికా విలేకరి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాడు. అందులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించాడు. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్మాణ పనులు చేపట్టడం, అక్రమంగా కుళాయి ఏర్పాటు చేసుకోవడంపై స్థానికులు బహిరంగంగా తప్పుపడుతున్నారు.

ప్రశ్నించిన రిపోర్టర్‌పై తిరుగుబాటు..

అక్రమ నిర్మాణాలపై రాయదుర్గం టీవీ 9 విలేకరి చందు ఘటనా స్థలానికెళ్లి ఈ స్థలం మీదే అన్నట్టు ఏమైనా పట్టా ఉందా? నిర్మాణాలకు అనుమతులున్నాయా? అని ప్రశ్నించాడు. దీంతో స్థలాన్ని ఆక్రమించిన సదరు విలేకరితోపాటు వారి బంధువులు అతనిపై తిరగబడ్డారు. ఓ విలేకరిగా తాను న్యూస్ కవరేజ్ చేస్తున్నా..మీరు సమాధానం చెప్పాలని నిలదీయగా, సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. వారి దౌర్జన్యంపై ప్రజలు నివ్వెరపోయారు. ఈ ఘటన సోషల్ మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది. మరోవైపు పంచాయతీ అధికారులకు ముచ్చెమటలు పట్టడంతో అక్రమంగా వేసిన కొళాయిని ఆగమేఘాలపై తొలగించారు. ఇటీవల తుంబిగనూర్‌లో స్కూల్ స్థలాన్ని సైతం ఓ టీడీపీ నాయకుడు కబ్జా చేశాడు. ఇలా ఎవరికిపడితే వారు యథేచ్ఛగా స్థలాలు దౌర్జన్యంగా క్రమించడం సరికాదని ప్రజలు మండిపడుతున్నారు.

ఊరూరా బెల్టు జోరు



- తాగినోళ్లకు తాగినంత
- విచ్చలవిడిగా బెల్టుషాపులు
- ఒక్కోషాపునకు రూ.లక్ష వసూలు
- కొన్ని గ్రామాల్లో వేలం పాటలు
- ఆటోలు, జీపులు, లగేజీ వాహనాల్లో మద్యం అక్రమ రవాణా
- గొలుసుకట్టుగా మద్యం అమ్మకాలు
- చర్యలు చేపట్టని అధికారులు



రాయదుర్గం: 'గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తా.. ఎమ్మార్పీకి మించి విక్రయించినట్లు ఎక్కడైనా తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవరి జోక్యం ఉన్న సహించేది లేదు'.

– ఇటీవల జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు ఇవీ..

అయితే దీనికి విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఊరూరా బెల్టు షాపులు పుట్టుకొచ్చాయి. యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తూ పేదలు, సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. మద్యం అమ్మకాలకు గేట్లు ఎత్తేశారు. ఒక అధికారిక దుకాణం పరిధిలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. దీంతో కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మద్యం ఏరులై పారుతోంది. మూడు నియోజకవర్గాల్లోనూ 37 ప్రైవేట్ మద్యం దుకాణాలు వెలిశాయి. వీటి పరిధిలో సుమారు 320 బెల్టు దుకాణాలు పుట్టుకొచ్చాయి. వీటిని పలు గ్రామాల్లో ఆలయాలు, క్రైస్తవ మందిరాలు, మసీదులు, విద్యాలయాలు చెంతనే నిర్వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెట్టేస్తున్నారు. దీంతో షరామామూలుగా విక్రయాలు సాగిస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. బాటిల్‌పై రూ.10 ఆపై ధరలు ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపు నిర్వహణకు దుకాణ నిర్వాహకులు కొందరు రూ.50 నుంచి రూ.లక్ష వసూలు చేసినట్టు బహిరంగంగా చర్చ సాగుతోంది. దీంతో ఆయా దుకాణాల నుంచి ఆటోలు, జీపులు, లగేజీ వాహనాలు మద్యం బాక్సులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. నడిరోడ్డుపైనే లావాదేవీలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

బెల్టు షాపుల కట్టడికి చర్యలు చేపట్టాం. ఎక్కడా వాటి జాడ కనిపించకుండా కృషి చేస్తున్నాం. దొంగ చాటుగా అమ్మకాలు చేపట్టే వారిపైనా నిఘా ఉంచాం. వాహనాల్లో మద్యం తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల బాధ్యతలు చేపట్టాను. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కర్ణాటక మద్యం రాయదుర్గంలో సీజ్‌చేసి కేసులు నమోదు చేశాం. బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం. ఇందులో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదు.

– మహేష్ కుమార్, ఎక్సైజ్ సీఐ, రాయదుర్గం

నాడు బెల్టు తీశారు

పేదోడు రోజువారి సంపాదన తాగుడుకు తగలేస్తూ ఖాళీ జేబుతో ఇంటికొస్తే కుటుంబం గడవడం సాధ్యం కాదనే విషయం తన సుదీర్ఘ పాదయాత్ర సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. అధికారంలోకొచ్చిన తర్వాత తొలి నెలలోనే బెల్టు షాపులు ఏరిపారేశారు. అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. ఈ విధానం కొనసాగిస్తే ప్రభుత్వానికి రూ.వేల కోట్లు లాభం వస్తుందని తెలిసినా సమాజంలో మార్పుకోసం మద్యం అక్రమ రవాణా, బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహించలేదు. దీనిపై కూటమి నేతలు విష ప్రచారం చేశారు. రూ.99 కే నాణ్యమైన మద్యం ఇస్తామంటూ నమ్మించారు. మద్యం ప్రియుల ఓట్లు దండుకునేలా కుట్ర చేశారు. తీరా చూస్తే ఊరూరా బెల్టు షాపులు అందుబాటులోకి తెచ్చారు. దీంతో మహిళలకు మళ్లీ పాత కష్టాలే తెచ్చిపెట్టారు. బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మహిళా సంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శెట్టూరు పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి

శెట్టూరు: మండల కేంద్రంలోని ప్రథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ తనిఖీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా అధికారులు ఆసుపత్రి పరిసరాలను శనివారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, డాక్టర్ తరుణసాయి, ఎంఈఓ శ్రీధర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత సంచారంపై ఆందోళనొద్దు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో శనివారం అటవీ శాఖ సిబ్బంది చిరుత జాడ కోసం అన్వేషించారు. ఇటీవల ముదిగల్లులో జనావాసాల్లోకి చిరుత రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. రాత్రి సమయాల్లో స్థానికులు బయటికి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చిరుత సంచరించిన గుట్ట ప్రాంతంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షావాజ్, ప్రొటెక్షన్ వాచర్లు కలియ తిరిగారు. ఒకచోట చిరుత ఉండదని, ఒక్కో రోజు ఒక్కో ప్రాంతానికి వెళ్తుంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. అయితే అడవి జంతువులకు హాని చేయకూడదని అవగాహన కల్పించారు.

మోసాలకు పాల్పడితే చర్యలు

కణేకల్లు: మండల కేంద్రంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ బేకరీని శనివారం తనిఖీ చేశారు. బేకరీలోని కేకులని తూకం చూడగా 2 కేజీలకు గాను 519 గ్రాములు తక్కువగా ఉండటాన్ని గమనించారు. బేకరీ యజమానికి రూ. 15,000 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూకాల్లో మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు రంగయ్య పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న రంగయ్య



మృతులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకులు ఫరూక్ (25), నాసిర్(16) మృతిచెందిన విషయం విదితమే. ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర నాయకుల బోయ తిప్పేస్వామి శనివారం పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. మృతుడు ఫరూక్ చికెన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇంటి పెద్ద దిక్కుగా ఉన్న ఫరూక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయింది. మృతుడు ఫరూక్‌కు ఏడాది వయస్సున్న కూతురు ఉంది. రంగయ్య మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ ఫణి కుమార్, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, కోఆప్షన్ అఫ్జల్, నాయకులు గోళ్ల సూరి, బోరంపల్లి రామిరెడ్డి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, రేవన్న, బిక్కిహరి, షెక్షా, ఆంజనేయులు పాల్గొన్నారు.

తలారి రంగయ్యకు సన్మానం

అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నాయకులు శనివారం సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రేవన్న, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, తలారి సత్తి, జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు కోనాపురం గంగాధరప్ప, గోళ్ల సూరి, దీపు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన ఫరూక్ (25), తాసిర్ (16) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీ మంజునాథ, శనివారం లక్ష్మంపల్లికి వెళ్లి ఫరూక్, తాసిర్ మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇరు కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. నాయకులు ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, పోస్టు రామకృష్ణ, ఆదిశేషు, తంజిల్, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, పాలయ్య, పెందింటి మంజు, హిమాంవలీ, మాబు, చాంద్ బాషా, అబ్దుల్ పాలల్గొన్నారు.

'దుర్గం'లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్



కొర్రకోడులో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్, అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ప్రారంభించారు. తొలుత వినాయక సర్కిల్‌లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి అనంతపురం రహదారి ఆర్‌టీసీ కార్యాలయ సమీపంలో రోడ్డు పక్కన క్లీన్ అండ్ గ్రీన్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, పద్మజ, ప్రశాంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

గుమ్మఘట్ట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర,స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఈఓపీఆర్‌డీ దాస్, వెలుగు కోఆర్డినేటర్ గోవిందప్ప, ఏపీఎం రాజ్‌కుమార్, మండల స్థాయి అధికారులు ప్రారంభించారు. ముందుగా డ్వాక్రా మహిళా సంఘాలతో కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

బెళుగుప్ప: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సాలిబాయి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ పెద్దన్న, అధికారులు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయితీల కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కూడేరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం కొర్రకోడులో స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారం



జేసీబీతో రస్తా పనులు చేయిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : ముద్దలాపురం – రాయలప్ప దొడ్డి గ్రామాలకు మధ్య కొన్ని నెలలుగా రహదారి సమస్య ఉండేది. దీంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ముద్దలాపురం ప్రజలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రస్తా సమస్యను తీర్చేందుకు రెవెన్యూ రికార్డులను పరిశీలించి, గత మూడు రోజుల నుంచి సర్వే చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు హద్దులను ఏర్పాటు చేశారు. ముద్దలాపురం – రాయలప్ప దొడ్డి గ్రామాల మధ్య 5 కిలో మీటర్లు దూరం కావడంతో జేసీబీలతో శనివారం పనులు చేయించి, దాదాపు 3 కిలోమీటర్లు వరకు తాత్కాలిక రస్తాను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని రాయలప్పదొడ్డి నుంచి ముద్దలాపురం వరకు తారురోడ్డు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగిరెడ్డి, సర్వేయర్ సుకర్ణ, వీఆర్వోలు లక్ష్మన్న, హనుమేష్, విలేజ్ సర్వేయర్లు హరీష్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నమాజ్‌తోనే సత్ప్రవర్తన, స్వర్గప్రాప్తి



సామూహిక ఇషా నమాజ్ చేస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: నమాజ్‌తోనే సత్ప్రవర్తన, స్వర్గ ప్రాప్తి కలుగుతుందని ఇస్లాం స్కాలర్స్ పేర్కొన్నారు. తబ్లిక్ జమాత్ ఆధ్వర్యంలో సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరులో రాయదుర్గం డివిజన్ స్థాయి ఇస్తెమా (ఇస్లామిక్ ధార్మిక సమ్మేళనం) రెండోరోజు శనివారం రాత్రి ఇషా నమాజ్‌తో ప్రశాంతంగా ముగిసింది. రాయదుర్గం డివిజన్ పరిధిలోని రాయదుర్గం, మొలకాల్మూరు, కణేకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, వైఎస్ హొసకోట ప్రాంతాల నుంచే కాక ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు ప్రాంత పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా ముస్లింలు ఇస్తెమాకు హాజరయ్యారు. ఇస్తెమాకు ముఖ్య ప్రసంగీకులుగా బెంగళూరు నుంచి ఇస్లామిక్ స్కాలర్స్ మౌలానా ముఫ్తి అస్లాం సాబ్, మౌలానా తాహీర్ ఖురేషి, నిసార్ అహ్మద్ హాజరై ఆధ్యాత్మిక బోధనలు చేశారు. మానవ జన్మ అల్లా ప్రసాదించిన గొప్ప వరమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతిని కోరుకోవాలన్నారు. దైవ ప్రవక్త మహమ్మద్ అడుగు జాడల్లో నడుస్తూ ఐదు పూటల నమాజ్ చేయాలన్నారు. చివరి రోజు శనివారం వేలాదిగా హాజరైన ముస్లింలు ఉదయం నుంచి రాత్రి దాకా జరిగిన సామూహిక ఫజర్, జోహర్, అసర్, మగ్‌రిబ్, ఇషా నమాజ్‌లను ఆచరించారు. రాత్రి ఇషా నమాజ్ తరువాత ముఫ్తి అస్లాం సాబ్ ప్రత్యేక దువా అనంతరం ఇస్తెమా ముగిసింది.

అస్తవ్యస్తంగా గొర్రెల పెంపకందారుల సంఘాల ఎన్నికలు

- ఈస్ట్ కోడిపల్లిలో ఓటరు జాబితాలో అవకతవకలు



కళ్యాణదుర్గం: ఎన్నికైన సభ్యులకు గుర్తింపు పత్రాలు అందిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలంలో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు అస్తవ్యస్తంగా ముగిశాయి. శనివారం మండలంలోని పాలవాయి, గరుడాపురం, మానిరేవు, ఈస్ట్ కోడిపల్లి గ్రామాల్లో ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు జరిగాయి. అయితే ఈస్ట్ కోడిపల్లి సొసైటీలో ఓటరు జాబితాలో అవకతవకలు ఉండటంతో మరోసారి ఎన్నికలు నిర్వహించాలని సభ్యులు పట్టుపట్టారు. దీంతో అధికారులు చేసేదేమీలేక ఎన్నికలను వాయిదా వేశారు. ఎన్నికల అధికారులుగా కంబదూరు పశువైద్యుడు డాక్టర్ సమతా రెడ్డి, గుమ్మగట్ట పశువైద్యుడు బి.నవీన్ కుమార్, డాక్టర్ రమేష్, సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ మంజునాథ్ వ్యవహరించారు. అనంతరం ఏకగ్రీవమైన సొసైటీలలో బోర్డు సభ్యులకు గుర్తింపు పత్రాలను అధికారులు అందజేశారు.

దుద్దేకుంట ఎన్నిక ఏకగ్రీవం

బెళుగుప్ప: దుద్దేకుంటలోని ఆంజనేయస్వామి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక శనివారం ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారి మంజునాథ్ పర్యవేక్షణలో కార్య నిర్వహణ అధికారులు బెళుగుప్ప, రాయదుర్గం పశు వైద్యాధికారులు ఏ.రమేష్, సూర్యనారాయణరెడ్డితో కలసి ఏడుగురు సభ్యులను తొలుత ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలోనే శ్రీహనుమంత రాయస్వామి ప్రాథమిక గొర్రెల సహకార సంఘం అధ్యక్షులుగా రమేష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మన్నలతో పాటు ఐదుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు.

గొర్రెల సొసైటీ ఎన్నిక వాయిదా

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో శనివారం గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నిక వాయిదా పడింది. శనివారం ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే గొర్రెల పెంపకందారులకు సంబంధించి పూర్తి స్థాయిలో ఓటరు జాబితా లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారిణి డాక్టర్ ఉషా తెలిపారు. కార్యక్రమంలో చోళసముద్రం పశు వైద్యాధికారి శ్వేతా, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు సుబ్బరాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్/ఉరవకొండ: రాయదుర్గం, ఉరవకొండ పట్టణాల్లో నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. రాయదుర్గంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష నిర్వహించగా, 468 మంది విద్యార్థులకు గాను 388 మంది పరీక్షలకు హాజరుకాగా 78 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు పరీక్షలు జరిగాయి. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 252 మంది విద్యార్థులకు 197 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 216 మందికి గాను 191 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటిండెంట్లు మురహరి, సోమశేఖర్ తెలిపారు.

= ఉరవకొండలోని ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మొత్తం 293 పరీక్షలకు హాజరుకాగా 77 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మొత్తంగా 216 మంది పరీక్షకు హాజరైయ్యారు. పరీక్షల విభాగం సీఈఓ షేక్ ఆసాద్ ఆలీ పరీక్షలను పర్యవేక్షించారు.

సంక్షిప్త సమాచారం

నేడు మోడల్ డీఎస్సీ పరీక్ష

కళ్యాణదుర్గం: ఈనెల 19న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బద్దే నాయక్ తెలిపారు. శనివారం స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9.30 గంటల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్/ఓటర్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/ రేషన్ కార్డు తీసుకురావాలన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం

కుందుర్పి:గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు అనూషా, చాంద్ బేగం తదితరులు సూచించారు. శనివారం మండలంలోని అల్లాపురం, మందలపల్లి గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎన్‌ఎంలు,ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాలు స్వాధీనం చేసుకోండి

కుందుర్పి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని కుందుర్పి, మహంతపురం తదితర గ్రామాల ప్రజలు శనివారం తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మహంతపురం, కెంచంపల్లి, శ్రీమజ్జనపల్లి, వడ్డేపాళ్యం తదితర గ్రామాల్లో శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురైనట్లు తెలిపారు.

అడవులకు నిప్పుపెడితే జైలుకే

కుందుర్పి: వేసవిలో ఉద్దేశ పూర్వకంగా అడవులకు నిప్పు పెడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప హెచ్చరించారు. శనివారం అటవీ ప్రాంత పరిధిలోని కలిగొలిమి,కొలిమిపాళ్యం,అప్పాజిపాళ్యం తదితర గ్రామాల్లో మేకలు, పశువుల కాపర్లకు అడవులకు నిప్పు పడకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

భూ రీ-సర్వేకు సహకరించండి

కూడేరు: ఈ నెల 20 నుంచి గ్రామంలో భూ రీ-సర్వే చేపడుతున్నాం.. సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా కోరారు. శనివారం జయపురంలో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ సోమవారం నుంచి 4 బృందాలుగా అధికారులు ఏర్పడి సర్వే చేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో రీ-సర్వే డీటీ ప్రసాద్, సర్వేయర్ అయేషా సిద్ధికీ, వీఆర్వో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బెళుగుప్ప: గంగవరం గ్రామానికి చెందిన షేక్ లాలుసాబ్ (32) అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రామదాసు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఈనెల 16న పురుగుల మందు సేవించడంతో చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య షేక్ బీబీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హోమియో వైద్యురాలిగా నాగజ్యోతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని హోమియోపతి వైద్యశాల రెగ్యులర్ వైద్యురాలిగా నాగజ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరుకు చెందిన ఈమె హోమియోపతి వైద్యురాలిగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వైద్యుడిగా పని చేస్తున్న లాల్యానాయక్ పదోన్నతిపై బదిలీ అయినట్లు తెలిపారు.

ఎల్ఐసీ జాతీయాకరణ లక్ష్యాలు కొనసాగించాలి

రాయదుర్గం టౌన్: ఎల్ఐసీ జాతీయాకరణ లక్ష్యాలను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాయదుర్గం బ్రాంచ్ మేనేజర్ శేషగిరి, కార్యదర్శి కృష్ణభూషణ్, శ్రామిక మహిళా కన్వీనర్ మహాలక్ష్మీ తెలిపారు. ఎల్ఐసీ జాతీయాకరణ జరిగి 69 ఏళ్లు పూర్తయ్యిందని వారు తెలిపారు. 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల మోసాల నుంచి ప్రజలను కాపాడే ఓ ప్రభుత్వ సంస్థగా ఎల్ఐసీని ఏర్పాటు చేశారని వారు ఓ ప్రకటనలో తెలిపారు. లైఫ్ ఇన్సూరెన్స్‌ల బీమా ప్రీమియంలపై జీఎస్టీ భారాన్ని పూర్తిగా తొలగించాలని వారు డిమాండ్ చేశారు. జనవరి 20 బిజినెస్ డే జయప్రదం చేయాలని వారు కోరారు.

20న ఇళ్ల వద్దే ఉండాలి

గుమ్మఘట్ట: మంచానికి పరిమితమైన వారు, పక్షవాతంతో బాధపడుతున్న వారు, పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు ఈ నెల 20న ఇళ్ల వద్దే ఉండాలని ఎంపీడీఓ రామకృష్ణ కోరారు. వైద్య బృందం సభ్యులు ఇళ్ల వద్దకే వచ్చి వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కొందరు బోగస్ సర్టిఫికెట్లతో పింఛనుల పొందుతున్నారని ఆయన తెలిపారు.